

తమను క్రమబద్ధీకరించాలని జేఎన్టీయూహెచ్ వర్సిటీ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు కోరారు. ఈ మేరకు సోమవారం వర్సిటీలో ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ, పాలిటెక్నిక్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసినట్లుగానే తమనూ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. -కేపీహెచ్‌బీ కాలనీ


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, మంగళవారం 8 ఏప్రిల్ 2025 HYDERABAD




తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఉద్యమకారుల ప్లీనరీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో 21న జరగనున్న ప్లీనరీ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. -మల్కాజిగిరి

# పనులు చేయలేం..

## చేసిన కాడికి బిల్లులు ఇవ్వండి.. బల్దియాకు కాంట్రాక్టర్ల అల్టిమేటం

### రూ.200 కోట్ల పెండింగ్ బిల్లులపై పోరు

### గ్రేటర్‌లో అటకెక్కిన డబుల్ ఇండ్ల నిర్మాణం

సిటీబ్యూరో: డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు జీహెచ్‌ఎంసీకి అల్టిమేటం జారీ చేశారు. పనులు చేయలేం..చేసిన కాడికి బిల్లులివ్వండి అంటూ.. ప్రస్తుత ధరలకు అనుగుణంగా రేట్లను పెంచితే ఆలోచిస్తామంటూ అధికారుల ముందు తాజా డిమాండ్‌ను పెట్టారు. పెండింగ్ పనులు పూర్తి కావాలంటే రూ. 2823.49 కోట్లు అవసరమని అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కాంట్రాక్టర్లకు సంబంధించి రూ. 200కోట్ల మేర బిల్లులు పెండింగ్ ఉండడం, బకాయి వచ్చే వరకు కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ససేమిరా అంటుండడంతో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.

### రూ. 9714.59 కోట్లతో..

నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్న లక్ష్యంతో కేసీఆర్ సర్కారు డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణ పథకాన్ని చేపట్టింది. 2015లో ఈ స్కీం కింద వంద శాతం సబ్సిడీతో ఈ ప్రాజెక్టును రూ.9714.59 కోట్లతో శ్రీకారం చుట్టింది. హైదరాబాద్ నగరంలో ఒక్క ఐడీహెచ్ కాలనీలో ఇండ్లను విజయవంతంగా పూర్తి చేసి తర్వాత లక్ష డబుల్ బెడ్రూం ఇండ్ల పథకాన్ని చేపట్టింది. 108 ప్రాంతాల్లో 97,629 పనులు పట్టాలెక్కించగా,..కొన్ని సాంకేతిక కారణాలతో 2371 ఇండ్ల పనులు ప్రారంభించలేదు. ఈ పథకంలో భాగంగా మురికివాడల్లోని పాత ఇండ్లను కూల్చేసి వాటి స్థానంలో (ఇన్‌సిటూ) 39 ప్రాంతాల్లో 8474 ఇండ్లను నిర్మించారు. 69 ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో 89155 ఇండ్ల పనులు చేపట్టారు. వీటితో ఇప్పటి వరకు 73 ప్రాంతాల్లో 69, 633 ఇండ్లను లబ్ధిదారులకు కేసీఆర్ సర్కారు అందజేసింది. కానీ అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ పథకాన్ని అటకెక్కించింది. ఉన్న ఇండ్లలో మౌలిక వసతులను కల్పించడంలో ఘోరంగా విఫలమైంది. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టులో భాగంగా ఇండ్లను కోల్పోయిన వారికి కేసీఆర్ సర్కారు కట్టించిన 16వేల డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలని నిర్ణయించారు. మొదటి దశలో 14 ప్రాంతాల్లో 1672 ఇండ్లను కేటాయించారు. వీరిలలో 311 మంది లబ్ధిదారులు మాత్రమే ఇండ్లలో ఉంటున్నారని అధికారులు పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణం అసంతృప్తిగా ఉండడంతో మరికొంత మందికి ఇచ్చే ప్రక్రియను నిలిపివేశారు. ప్రభుత్వం 27,966 ఇండ్లను సకాలంలో పూర్తి చేయలేకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా కాంట్రాక్టర్లు సైతం పనులు చేపట్టలేక చేతులెత్తేయడంతో ఎక్కడి ఇండ్లు అక్కడే నిలిచిపోవడం గమనార్హం.




# తీగలా.. యమ పాశాలా?

## ఇండ్లపైనే విద్యుత్ తీగలు..గృహాల పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు

సిటీబ్యూరో/ మేడ్చల్/ సైదాబాద్/మలక్‌పేట/చార్మినార్:

- మే నెలలో కృష్ణానగర్ ప్రధాన రహదారిలో వీధి దీపాల స్తంభానికి విద్యుత్ సరఫరా తీగలు ఉన్నాయి. అనుకోకుండా స్తంభానికి తగిలిన ఒక హార్డ్ వేర్ ఇంజినీర్ స్తంభానికి కరెంట్ పాస్ కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.
- గత సంవత్సరం అడ్డగుట్ట ప్రాంతంలో అడ్డదిడ్డంగా ఉన్న కేబుళ్లకు విద్యుత్ సరఫరా అయి అక్కడే ఆడుకుంటున్న బాలిక కరెంట్ షాక్‌కు గురికాగా, ఆమెను కాపాడబోయే క్రమంలో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ భార్య ప్రాణాలు కోల్పోయింది.

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు.. తుప్పుపట్టిన ఇనుప స్తంభాలు.. వేలాడుతున్న తీగలు.. మూతల్లేని ఫ్యూజ్ బాక్సులు.. రోడ్ల మధ్యన స్తంభాలు.. ఇలా దక్షిణ డిస్కంలో క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరా నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా ఉన్నది. పలు బస్తీల్లో ఇండ్ల సమీపం నుంచి, మరి కొన్ని ఇండ్ల మీద నుంచి, బాల్కనీల పక్క నుంచి 11 కేవీ విద్యుత్ తీగలు వెళ్తున్నాయి. ఈ తీగలకు మీటరు దూరంలో ఉన్నా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. విద్యుత్ తీగలు గతంలో తెగిపడిన కారణంగా ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలూ ఉన్నాయి. విద్యుత్ నిర్వహణలో భాగంగా ప్రతీవారం 33 కేవీ విద్యుత్ లైన్లను సిబ్బంది పర్యవేక్షిస్తూ తీగల స్థితిగతులను తెలుసుకోవాల్సి ఉంటుంది. కానీ చాలాచోట్ల సిబ్బంది అసలు తీగలవైపే చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



మూసారాంబాగ్ డివిజన్ సంజీవయ్యనగర్‌లో ఇండ్లకు తగులుతున్న విద్యుత్ తీగలు..కరెంట్ స్తంభాలు, ఈస్ట్ ప్రశాంత్‌నగర్ కాలనీ, బల్దియా వార్డుకు వెళ్లే మూలమలుపు వద్ద ఇంటిపైనే ఒరిగిన స్తంభం

### ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు..

సిటీలోని బహదూర్‌పురలో ఇటీవల రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడంతో ఫుట్‌పాత్ దుకాణాల్లో వస్తువులు కాలిపోయాయి. ఓల్డ్‌సిటీలోని గౌలిపుర, కందికల్ బోయిగూడ, ఛత్రినాక, సుల్తాన్‌షాహీ, ఉప్పుగూడ, శివాజీనగర్ తదితర ప్రాంతాల్లో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు అనేకం ఉన్నాయి. రోడ్డు పక్కన, ఇండ్ల పక్కన ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె నిర్మించలేదు. ఇక స్కూళ్లు, పబ్లిక్ టాయిలెట్స్, ప్లేగ్రౌండ్స్ పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో జనం ఆందోళన చెందుతున్నారు. మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ బాబాగూడ ఎస్సీ కాలనీలో ఉన్న సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు చెట్ల తీగలు అల్లుకుపోయి ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి.

### అడ్డదిడ్డంగా కరెంటు తీగలు..

ఏ కాలనీలో చూసినా విద్యుత్ స్తంభాలకు భయంకరంగా వేలాడుతున్న కేబుళ్లు కనిపిస్తున్నాయి. వాటిని తమ అవసరాల కోసం కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లు ఏర్పాటుచేసి నిర్వహణ గాలికి వదిలేస్తున్నారు. ఈ క్రమంలో 28 కంపెనీల ప్రతినిధులతో సీఎండీ ముషారఫ్ ఫరూఖీ గతంలో సమావేశమై ఆ తీగలను తొలగించాలని సూచించారు. అయితే ఇతర వైర్ల సంగతేమో కానీ చాలాచోట్ల కరెంట్ తీగల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ముసారాంబాగ్ డివిజన్ ఈస్ట్ ప్రశాంత్‌నగర్ కాలనీ, బల్దియా వార్డు ఆఫీస్‌కు వెళ్లే మూల మలుపు వద్ద విద్యుత్ లైన్లు ఏకంగా ఇంటినే ఆనుకుని ఉన్నాయి. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో కరెంటు తీగలు ఇండ్లపైనే ఉన్నాయి. కార్పొరేషన్‌లోని కృష్ణపురికాలనీలో ఓ ఇంటిపై కరెంటు తీగలు ఉండటంతో కుటుంబమంతా బతుకు జీవుడా అంటూ జీవిస్తున్నది. కూకట్‌పల్లి, కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్లలో స్తంభాలకు ఉన్న కేబుల్స్ ప్రాణాంతకంగా ఉన్నాయి.

### అధ్వానంగా విద్యుత్ స్తంభాలు

బంజారాహిల్స్‌లో 19698 , సైబరాబాద్‌లో 48219, హబ్సిగూడలో 59645, హైదరాబాద్ సెంట్రల్‌లో 24021, హైదరాబాద్ సౌత్‌లో 20835 , మేడ్చల్‌లో 69889, రాజేంద్రనగర్‌లో 51965, సరూర్‌నగర్‌లో 47359, సికింద్రాబాద్ సర్కిల్‌లో 25097 స్తంభాలు ఉన్నాయి. ఇందులో గత సంవత్సరం డిసెంబర్ 31 నాటికి మొత్తం 6306 పోల్స్ అధ్వానంగా ఉన్నట్లు గుర్తించారు. ప్రధాన ఏరియాల్లో 33,11 కేవీ ఎల్‌టీలు దాదాపుగా మార్చినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల మార్చడానికి వీలు లేకుండా ఉన్నవాటి విషయంలో కూడా ఎలా చేయాలనేదానిపై సిబ్బందితో, స్థానికులతో చర్చిస్తున్నామని వారు తెలిపారు.



జవహర్‌నగర్‌లోని కృష్ణపురికాలనీలో ఓ ఇంటిపై నుంచి ఉన్న విద్యుత్ తీగలు



బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

## మరిన్ని విజయాలు సాధించేందుకు

# ఉద్యమ సారథి కేసీఆర్ సిద్ధం

### ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, ఏప్రిల్ 7: రాష్ట్ర సాధనతో పాటు అభివృద్ధిలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపిన ఉద్యమసారథి కేసీఆర్ మరిన్ని విజయాలు సాధించేందుకు సిద్ధంగా ఉన్నారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఈనెల 27న వరంగల్ లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సభకు సంబంధించిన జనసమీకరణ, తదితర అంశాలపై సోమవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తన క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, పార్టీ ముఖ్యనేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ సారథి కేసీఆర్ నాయకత్వంలో 25 ఏండ్ల కిందట ఏర్పాటైన బీఆర్‌ఎస్ పార్టీ అనేక విజయాలు సాధించిందన్నారు. 25 ఏండ్ల బీఆర్‌ఎస్ ప్రయాణాన్ని నెమరువేసుకుంటూ రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించేందుకు పార్టీ అధినేత కేసీఆర్ సిద్ధమవుతున్నారన్నారు. తెలంగాణ ప్రజలు ఏడాదిన్నర కాంగ్రెస్ పార్టీ పాలనతో విసిగిపోయారన్నారు. ముఖ్యంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల అరాచకాలు మితిమీరిపోయాయని, భూకబ్జాలు, బెదిరింపులు చేస్తూ సామాన్యులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. వరంగల్ లో నిర్వహించనున్న రజతోత్సవ సభకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి 3వేలమంది కార్యకర్తలు, అభిమానులు వచ్చేందుకు రవాణా ఏర్పాట్లు చేశామన్నారు. డివిజన్ వారీగా, బూత్ వారీగా సభకు వచ్చేవారి వివరాలను సిద్ధం చేయాలని పార్టీ నేతలను ఆదేశించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రాజ్ కుమార్ పటేల్, దేదీప్య రావు, సీనియర్ నేతలు షరీఫ్, జావేద్, విజయ్ కుమార్, అజయ ,శ్యామ్ రావు, రామకృష్ణ, నర్సింగ్ రావు, అప్పు ఖాన్, అరుణ్, ఫయాజ్, కే ఎన్ రెడ్డి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు తెలంగాణ భవన్‌లో గ్రేటర్ బీఆర్‌ఎస్ నేతల సమావేశం

సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ స్థాయి బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఈ నెల 8 (మంగళవారం)న ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. సభ విజయవంతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ఇతర ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొంటారని తలసాని వివరించారు.





కూకట్‌పల్లిలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

# కాంగ్రెస్ పాలనతో విసుగెత్తిపోయిన ప్రజలు

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

### బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 7 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కూకట్‌పల్లి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బాలనగర్ డివిజన్ ఇంద్రనగర్ కాలనీకి చెందిన పుట్టపాక మధు, బాలరాజు, కురుమయ్యతో పాటు 50 మంది కాంగ్రెస్ పార్టీ నేతలు బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమని, కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడించినా.. ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయిందని, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్ల కాలంలో జరిగిన అభివృద్ధి ప్రజల కండ్ల ముందే కనిపిస్తున్నదన్నారు. కాంగ్రెస్ పాలనతో విసుగెత్తిపోయిన ప్రజలు రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

## అడిగినంత ఇవ్వకుంటే..

# గుర్తొస్తున్న రూల్స్..



### శివారులో ప్రాంతాల్లో ఆరోగ్యశాఖ వసూళ్ల దందా



సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): నగర శివారు ప్రాంతాలైన రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో కొందరు ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ క్లినిక్‌లలో వసూళ్ల దందాకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గడిచిన సంవత్సరం కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ వైద్యులపై 430ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా అందులో 200కు పైగా రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల పరిధిలోనే నమోదు కావడం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన కేసుల్లో 50 శాతం కంటే ఎక్కువ కేసులు కేవలం మూడు జిల్లాలో నమోదయ్యాయంటే ఈ ప్రాంతాల్లో నకిలీ వైద్యులు ఏ స్థాయిలో తిష్ట వేశారో అర్థం చేసుకోవచ్చు. హైదరాబాద్‌లో కార్పొరేట్, ప్రైవేటుతో పాటు ఉస్మానియా, గాంధీ వంటి ప్రభుత్వ స్పెషాలిటీ దవాఖానలు ఉండడంతో నగరంలో నకిలీల హవా పెద్దగా నడవడం లేదు.

### పెద్ద ఎత్తున వసూళ్లు..

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన వైద్య, ఆరోగ్యశాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది అర్హత లేని నకిలీ వైద్యులతో అంటకాగుతూ, వారి నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ నకిలీ వైద్యులు యథేచ్ఛగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ అందినకాడికి దండుకుంటున్నారు.

### తూతూ మంత్రంగా చర్యలు

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోకపోవడమే కాకుండా ఏదైనా ఘటనలు జరిగినప్పుడు హడావిడి చేసే అధికారులు తూతూ మంత్రంగా క్లినిక్‌లు, దవాఖానలను సీజ్ చేస్తున్నారని, రెండు మూడు రోజులకే మళ్లీ అవి తెరుచుకుంటున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే మేము సీజ్ చేశాం, మళ్లీ తెరిచిన విషయంపై మాకు ఫిర్యాదు అందలేదని నిర్లక్ష్యపు సమాధానాలు ఇస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

### అడిగినంత ఇవ్వకపోతే సీజ్

కొందరు అధికారులు, సిబ్బంది అడిగినంత ముట్టజెప్పకుంటేనే అప్పుడు వారికి రూల్స్ గుర్తొస్తున్నాయని, వాటిని అడ్డం పెట్టుకుని క్లినిక్‌లు, దవాఖానలను సీజ్ చేసి, నిర్వాహకులను తమ దారికి తెచ్చుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## లైంగికదాడి చేయబోతే..

# రాయితో కొట్టి

మేడ్చల్, ఏప్రిల్ 7 : యువతిపై లైంగికదాడికి యత్నించగా, అతడి తలపై రాయితో కొట్టి బాధితురాలు తప్పించుకున్న ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఒడిశాకు చెందిన యువతి(19) ఆదివారం రాత్రి గుండ్లపోచంపల్లి నుంచి రైల్వే ట్రాక్‌పై మేడ్చల్ వైపు నడుచుకుంటూ వస్తుండగా గౌడవెల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి తనపై లైంగికదాడికి యత్నించాడని.. దీంతో అతడి తలపై రాయితో కొట్టి అక్కడి నుంచి తప్పించుకుని వచ్చానంటూ బాధితురాలు మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. రైల్వే ట్రాక్‌పై ఘటన జరగడంతో మేడ్చల్ పోలీసులు కేసును సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు బదలాయించారు. కాగా ఈ విషయమై సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆదివారం రాత్రి ఓ గుర్తుతెలియని వ్యక్తి తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ ఓ యువతి ఫిర్యాదు చేసిందన్నారు. ఘటన రైల్వే ట్రాక్‌పై జరగడంతో రైల్వే పోలీసులకు కేసు బదిలీ చేశామన్నారు. యువతి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని, ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతామన్నారు.

# మేయర్ శంకుస్థాపన చేసినా..

## రెండు నెలలుగా పెండింగ్‌లో రోడ్డు పనులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 7 : మేయర్ శంకుస్థాపన చేసినా.. రెండు నెలలుగా ఆ బస్తీకి రోడ్డు దిక్కులేదు. బంజారాహిల్స్ డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో గతుకుల రోడ్డుతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండేండ్ల కిందట ఓ పైపులైన్ కోసం రోడ్డును అడ్డదిడ్డంగా తవ్వి వదిలేశారు. దీంతో నాటి నుంచి నేటి వరకు సరైన రోడ్డు లేక వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండగా, వర్షాకాలంలో బురదగుంటలుగా మారిపోతున్నది. డివిజన్‌కు కార్పొరేటర్ అయిన నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి ఎన్ని సార్లు విన్నవించినా.. పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. మేయర్ పదవి కాలం ముగియడానికి మరికొన్ని నెలలు మాత్రమే సమయం ఉండడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో మేయర్ హడావుడిగా రూ. 22.30 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కానీ.. నేటి వరకు పనులు చేపట్టకపోవడంతో మేయర్‌పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని 150 డివిజన్లకు మేయర్ అయి ఉండి తన సొంత డివిజన్‌లోనే రోడ్డు వేయించలేకపోతున్నారని మండిపడుతున్నారు. కనీసం ఎన్నికల స్టంట్‌గానైనా రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రేమ్‌నగర్ బస్తీవాసులు వేడుకుంటున్నారు.



అధ్వానంగా మారిన రోడ్డు, వెక్కిరిస్తున్న శిలాఫలకం

